క్లుప్తంగా

అమ్మవారికి అభిషేకం



అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ నేతృత్వంలో ఆదివారం వేకువ జామున 4 గంటల నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు.అనంతరం అమ్మవారిని అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ చేశారు.

చీపురుపల్లి డీఎస్పీగా రాఘవులు



డీఎస్పీ రాఘవులు

చీపురుపల్లి: చీపురుపల్లి సబ్ డివిజినల్ పోలీస్ ఆఫీసర్(డీఎస్పీ)గా ఎస్.రాఘవులు నియమితులయ్యారు. ఇదివరకు ఇక్కడ డీఎస్పీగా పని చేసిన ఏ.ఎస్.చక్రవర్తికి ఏఎస్పీగా పదోన్నతి లభించింది. దీంతో ఆయన స్థానంలో ఇంటిలిజెన్స్ విభాగంలో డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న రాఘవులు ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈయన 2014 నుంచి 2016 వరకు చీపురుపల్లి సీఐగా పనిచేశారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న ఎస్ఐ సాయికృష్ణ, పోలీస్ సిబ్బంది

గంట్యాడ: పర్యావరణ పరిరక్షణతో భాగంగా మొక్కలు నాటి, సంరక్షించడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎస్ఐ డి.సాయికృష్ణ కోరారు. వన మహోత్సవంలో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సిబ్బందితో కలిసి ఆది వారం మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ కాలుష్య నివారణకు, భావితరాలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు మొక్కల పెంపకం ఒక్కటే మార్గమన్నారు. పుట్టినరోజులు, శుభకార్యాలకు మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యారావు

శృంగవరపుకోట: ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ జవాబుదారీగా ఉండాలని ఓటరు అక్షరాస్యత వేదిక అధ్యక్షుడు డి.సూర్యారావు అన్నారు.స్థానిక శాఖాగ్రంథాలయంలో సూర్యారావు అధ్యక్షతన ఆదివారం డెమోక్రసీ డే నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని అనుసరించి ప్రజాస్వామ్యం ఎలా అమలుపరుచుకోవాలో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. స్వేచ్ఛ, నిర్ణయాధికారం, ప్రజల భాగస్వామ్యం, చట్టబద్దపాలన, స్వయంవృద్ధి అందరికీ అందుతున్నాయా లేదా అని గమనించాలన్నారు. ప్రజాస్వామ్యంలో లోపాలు ఎత్తి చూపడమే కాకుండా వాటిని సవరించే బాధ్యత తీసుకోవాలని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చెప్పినట్టు సాంఘిక ప్రజాస్వామ్యం లేనిదే ఆర్థిక, రాజకీయ ప్రజాస్వామ్యం రాదన్నారు. కార్యక్రమానికి హాజరైన జియో రామకృష్ణ, లైబ్రేరియన్ శ్రీధర్, ఎం.అప్పారావు, గౌరీశంకర్, డి.మేఘన తదితరులు మాట్లాడారు.

బియ్యం పంపిణీ

విజయనగరం ఫూల్‌బాగ్: నవజీవన్ ట్రస్ట్ ఫౌండర్ డీకే శ్రీధర్ ఆచార్య ఆధ్వర్యంలో అన్నలక్ష్మి ఫ్రీ రేషన్ డిస్ట్రిబ్యూషన్‌లో భాగంగా 35 మంది వితంతువులకు ఆదివారం బియ్యం పంపిణీ చేశారు. కణపాకలోని సాయిబాబా కాలనీలో జరిగిన ఈ కార్యక్రమంలో అమ్మ సేవా సంస్థ ప్రతినిధి పురుషోత్తం, ఎస్వీ రమణ, డి. శ్రీనివాసరావు, బి. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతుల ఊసే లేదు..

- వర్షం మిగిల్చిన నష్టం
- వారం గడుస్తున్నా పట్టించుకోని వైనం



శృంగవరపుకోట: వర్షాలకు కోతకు గురైన భవానీనగర్-భర్తాపురం రోడ్డు

చీపురుపల్లి: అల్పపీడనం ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం వాటిల్లింది. అయితే వర్షం వదిలి వారం కావస్తున్నా బాధితులకు ప్రభుత్వం భరోసా కల్పించలేకపోవడంతో వరదలకు పలు చోట్ల జరిగిన నష్టాలను పూడ్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చిన్న చిన్న మరమ్మతులు కూడా చేపట్టలేకపోవడం ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు మండలంలోని నాగంపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రహరీ కూలిపోయింది. పాఠశాల వద్ద ఉన్న చెరువు నిండుకుండను తలపిస్తోంది.విద్యార్థుల రక్షణ దృష్ట్యా అక్కడ ప్రహరీ చాలా అవసరం. అయితే ప్రహరీ కూలిపోయి వారం గడుస్తున్నా ఇంతవరకు మరమ్మతులు చేపట్టలేదు. చిన్న పిల్లలు చెరువు వైపు వెళితే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని గ్రామస్తులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.అలాగే యలకలపేట గ్రామంలో చాకలి చెరువుకు గండి కొట్టగా అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులే స్వచ్ఛందంగాగండిని పూడ్చుకున్నారు.

కోతకు గురైన రోడ్డు

శృంగవరపుకోట: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని భవానీనగర్ నుంచి భర్తాపురం వెళ్లే రోడ్డు కోతకు గురయ్యింది. వర్షాలు వదిలి వారం కావస్తున్నా అధికారులు ఇంకా మరమ్మతులు ఊసే ఎత్తడం లేదు. రోడ్డును పునరుద్ధరించమని అడిగినా అధికారులు స్పందిచడం లేదని, మరమ్మతుల కోసం ఉపాధి హామీ పనుల్లో ప్రతిపాదన పెట్టామని స్థానిక నేతలు చెబుతున్నారు. అలాగే విశాఖ-అరుకు రోడ్డు కొత్తవలస నుంచి బొడ్డవర వరకూ పలు చోట్ల గోతులు తేలింది.



చీపురుపల్లి: అధికారులు స్పందించకపోవడంతో యలకలపేటలో చాకలిచెరువు గండిని రైతులే పూడ్చుకుంటున్న దృశ్యం



చీపురుపల్లి: నాగంపేట ప్రాథమిక పాఠశాలలో కూలిపోయిన ప్రహరీ



చీపురుపల్లి: నాగంపేట ప్రాథమిక పాఠశాలను ఆనుకుని ఉన్న చెరువు

ఈకేవైసీ తప్పనిసరి



జామి: జామిలో ఈకేవైసీ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏడీఏ విజయ

జామి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించు కోవాలని కొత్తవలస సబ్‌డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) ఎల్.విజయ సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో వ్యవ సాయ శాఖ సిబ్బంది ఆదివారం చేపట్టిన ఈకేవైసీ ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 85శాతం ఈ- క్రాప్ నమోదు, రైతుల ఈకేవైసీ పూర్తయిందన్నారు.ఈ-క్రాప్‌లో పంటలను నమోదు చేసుకోకపోతే ప్రకృతి వైపరీత్యాలకు పంటదెబ్బతింటే నష్టపరిహారం రాదని చెప్పారు. అలాగే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించుకునే అవకాశం ఉండదన్నారు. మండలంలో మిగిలిన రైతులంతా త్వరగా ఈ-క్రాప్ నమోదు చేసుకుని, ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఏఓ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెలాఖరు వరకు గడువు

మెరకముడిదాం: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు సాగుచేస్తున్న పంటలకు ఈ-క్రాప్ నమోదుకు ఈనెల 30 వరకు ప్రభుత్వం గడు వు పొడిగించిందని ఏఓ శ్రావణితేజ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంకా ఈ-క్రాప్ నమోదు చేసుకోని రైతులు వెంటనే చేయించుకోవాలని సూచించారు.

గజపతినగరంలో నేత్రవైద్య శిబిరం



గజపతినగరం: నేత్ర పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ అలేఖ్య

గజపతినగరం: మండల కేంద్రంలోని బాలుర హైస్కూల్‌లో సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నేత్రవైద్య శిబి రం నిర్వహించారు. శిబిరంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి చెందిన ఆప్తాలమిక్ అలేఖ్య 63 మందికి నేత్ర పరీక్షలు చేసి 28 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్‌లు చేయనున్నామని ఆప్తాలమిక్ చెప్పారు. సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ సంస్థ కార్యదర్శి రేవంత్, సభ్యులు మణికంఠ, శ్యామ్, క్యాంప్ కో-ఆర్డినేటర్ వెంకటరమణ పాల్గొన్నారు.

నేడు మరడాంలో..

దత్తిరాజేరు: మండలంలోని మరడాం ఉన్నత పాఠశాలలో సోమవారం ఉదయం నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచ్ పోతల రామలక్ష్మి భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు శంకరరావు ఆదివారం తెలిపారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులు శిబిరంలో నేత్ర పరీక్షలు చేస్తారని చెప్పారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారిని గుర్తించి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తారని, శిబిరానికి ఆధార్ కార్డు, సహాయకులను తీసుకుని రావాలని సూచించారు.

రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన పూజల్లో పాల్గొన్న ఎంపీపీ వెంకటనరసమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: పట్టణంలోని కూరాకులవీధిలో చెరువు వద్ద మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలతో రిటైనింగ్‌వాల్ నిర్మాణానికి ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భారీవర్షాలు కురిస్తే కూరాకులవీధిని ఆనుకుని ఉన్న పెద్దచెరువు నిండి వరద నీరు వీధిలోకి వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. భవిష్యత్‌లో వర్షాలు కార ణంగా కూరాకులవీధి వాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పార్టీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీ, పార్టీ నాయకులు ఇప్పిలి గోవింద, ముల్లు పైడిరాజు, గిరిడ రాందాసు, మీసాల బాలు, అప్పికొండ ఆదిబాబు, కంచుపల్లి అశోక్, సతివాడ ఆదికృష్ణ, కంచుపల్లి రమేష్, లంకవలస నాగ రాజు, కరణం ఆది, పొంద్రంకి వాసు తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనోత్సవం



వినాయక ఊరేగింపులో కోలాటం చేస్తున్న మహిళలు

గజపతినగరం: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక సాయి అపార్ట్‌మెంట్ వద్ద మండపంలో కొలువు దీరిన వినాయకుడి నిమజ్జనోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళల కోలాటం ఆకట్టుకున్నాయి.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు



వివిధ గ్రేడ్ బెల్ట్‌లు సాధించిన విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్ రాఘవ, ఉపాధ్యాయులు

వేపాడ: స్థానిక శ్రీవిక్టరీ హైస్కూల్‌లో ఆదివారం కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ రాఘవ తెలిపారు. కోచ్ శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పలువురు విద్యార్థులు బ్లాక్ బెల్ట్, ఆరెంజ్ బెల్ట్, ఎల్లో బెల్ట్‌లను సాధించారు. ప్రతిభకనబరిచిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అభినందించారు.

పుస్తక పఠనంపై అవగాహన



చిన్నారులతో నీతికథల పుస్తకాలు చదివిస్తున్న రమణ

చీపురుపల్లి: విద్యార్థులకు తల్లిదండ్రులు ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తకపఠనంపై అవగాహన కల్పించాలని ఆశయ రూరల్ లైబ్రరీ అధ్యక్షుడు రెడ్డి రమణ కోరారు. ఆశయ రూరల్ లైబ్రరీ ఆధ్వర్యంలో యలకలపేట గ్రామంలో మొబైల్ బుక్ లైబ్రరీని ఆదివారం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు నీతికథలు, ఇతిహాసాలు, పురాణాలు, చరిత్రకు సంబంధించిన పుస్తకాలను అందజేసి చదివించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సెలువు దినాల్లో, ఖాళీ సమయాల్లో ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవాలన్నారు. పుస్తక పఠనంతో జ్ఞానం పెరుగుతుందన్నారు.

ఆకట్టుకున్న అఖండ దీపారాధన



చీపురుపల్లి: చీపురుపల్లి డైలీమార్కెట్ ఏరియా వినాయక మండపం ముందు శివుని చిత్రంపై దీపాలంకరణ



వేపాడ: కుమ్మపల్లిలో వినాయక మండపం వద్ద దీపారాధన

వేపాడ: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కుమ్మపల్లి గ్రామంలో రైజింగ్ స్టార్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద ఆదివారం రాత్రి అఖండ దీపారాధన చేశారు. గ్రామ పురోహితులు బమ్మిడి మర్రి శ్రీనివాస్ శర్మ గ్రామ మహిళలతో పూజలు చేయించి, అనంతరం వారితో దీపారాధన చేయించారు. శివలింగం, ఓంకారం, స్వస్తిక్ తదితర ఆకారాల్లో చేసిన దీపారాధన ఆకట్టుకుంది.

చీపురుపల్లిలో..

చీపురుపల్లి: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని డైలీమార్కెట్ ఏరియాలో వినాయక మండపం వద్ద శనివారం రాత్రి నిర్వ హించిన దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మండపం ముందు పరమశివుని చిత్రాన్ని గీసి ఆ చిత్రంపై దీపాలంకరణ చేశారు. దీపా లంకరణ చూసేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

అధ్వాన రహదారులతో అవస్థలు



గంట్యాడ మండలంలోని సిరిపురం రోడ్డులో గోతులు



దత్తిరాజేరు మండలంలోని పెదమానాపురం సంత సమీపంలో గోతులు తేలిన రోడ్డు

గంట్యాడ: మండలంలోని మురపాక నుంచి సిరిపురం వెళ్లే గ్రామ తారురోడ్డు అధ్వానంగా తయారైంది. ఎక్కడక్కడ గోతులు తేలడంతో ఆమార్గంలో ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని, అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని మురపాక, సిరిపు రం గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గోతులు తేలిన రోడ్డు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సంత నుంచి పోరాం గ్రామానికి వెళ్లే రోడ్డులో ఏర్పడిన గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గోతులు మరింత పెరిగాయి. వాహన చోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధి కారులు గోతులను పూడ్చివేయించాలని ఆమార్గంలో ప్రయాణించే వారు, వాహన చోదకులు కోరుతున్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు

విజయనగరం ఫోర్ట్: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఈపీడీసీఎల్ ఎస్ఈ ముప్పల లక్ష్మణరావు అన్నారు. ఇంజినీర్స్ డే సందర్భంగా ఆదివారం స్థానిక ఈపీడీసీఎల్ కార్యాలయంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఈ లక్ష్మణరావు మాట్లాడుతూ భారతరత్న, సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య భారతదేశానికి అందించిన సేవలు ఎనలేనివని,ఆయన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఇంజినీర్ తన కేరీర్‌లో ఎదగాలని ఆకాంక్షించారు. ఈఈలు పూడి హరి, జి.సురేష్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ట్యాంకులతో తాగునీరు సరఫరా



ట్యాంకుల ద్వారా రిక్షాకాలనీలో తాగునీరు సరఫరా చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: పట్టణంలోని రాజాం రోడ్‌లో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో రిక్షాకాలనీ వైపు ఉన్న తాగు నీటి సరఫరా పైపులైన్లు పాడయ్యాయి. దీంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయాన్ని కాలనీవాసులు మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ద్వారా కాలనీవాసులకు తాగు నీరు అందించాలని మేజర్ పంచాయతీ సర్పంచ్, వైస్ సర్పంచ్‌లకు సూచించారు. ఆదివారం కాలనీ వాసులకు సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఉపసర్పంచ్ బెల్లాన శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ నేతృత్వంలో మేజర్ పంచాయతీ వాటర్ ట్యాంక్‌లు ద్వారా తాగు నీటిని సరఫరా చేశారు.

సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు



గర్భాం- గరివిడి రోడ్డులో చినబంటుపల్లి సమీపంలో గోతులతో అధ్వానంగా ఉన్న రోడ్డు (ఫైల్)



మరమ్మతులు చేసిన తర్వాత

మెరకముడిదాం: మండలంలోని గర్భాం, గరివిడి ప్రధాన రహదారి ఎక్కడికక్కడ గోతులు తేలింది. ఇటీవల కురిసిన వర్షాలు ఈగోతులు మరింత పెద్దవి కావడంతో రోడ్డు అధ్వానంగా తయారైంది. వాహన చోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల అవస్థలను చూసిన జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు స్పందించి రోడ్డులో గోతులను పూడ్చివేయాలని మాజీ జెడ్పీటీసీ కోట్ల విశ్వేశ్వరరావుకు సూచించారు. ఆయన తనసొంత నిధులతో మరమ్మతులు చేయించారు. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రయోగాత్మక పరిష్కారాలు కనుగొనాలి



ఎక్స్‌పోను తిలకిస్తున్న హిందూస్తాన్ షిప్‌యార్డు మేనేజర్ శ్రీనివాసరావు, తదితరులు



పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ముఖ్య అతిథి శ్రీనివాసరావు, తదితరులు

- విశాఖ హిందూస్తాన్ షిప్‌యార్డు మేనేజర్ శ్రీనివాసరావు

డెంకాడ: ఇంజినీరింగ్ విద్యార్థులు సమస్యలకు వినూత్నంగా ప్రయోగాత్మక పరిష్కాలు కనుగొన్నప్పుడే గుర్తింపు లభిస్తుందని విశాఖ హిందూస్తాన్ షిప్‌యార్డు(నాణ్యత, భద్రత) మేనేజర్ డి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జొన్నాడ వద్ద గల లెండి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం సాయంత్రం ఇంజినీర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పేపర్ ప్రజెంటేషన్‌లను తిలకించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఇంజినీరింగ్ విద్యార్థుల ఆలోచనలు వినూత్నంగా ఉండాలన్నారు. హిందూస్తాన్ షిప్‌యార్డు లిమిటెడ్ ఇంజినీరింగ్ డిజైన్, రక్షణ రంగం, చమురు వ్యాపార సంస్థలకు నౌకల తయారీలో సేవలు అందిస్తోందన్నారు. కాలుష్యాన్ని నియంత్రించేలా ఓడలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హిందూస్తాన్ షిప్‌యార్డు టెక్నికల్ సపోర్ట్ ఎస్వీ రామారావు, వైస్ ప్రిన్సిపాల్ టి.హరిబాబు, కేవీ నరసింహం, ప్లేస్‌మెంట్ డీన్ జి.ప్రకాష్‌బాబు, కో ఆర్డినేటర్ బి.శ్రీధర్, విభాగాధిపతులు ఎ.రామరావు, ఎం.రాజన్‌బాబు, ఆర్.రాజేంద్ర, కె.సుబ్బరామయ్య, సతీష్ పూజారి, పి.దుర్గాశైలజ, సతీష్, వి.వరప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మోక్షగుండం' సేవలు ఎనలేనివి..



మోక్షగుండం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేఎన్‌టీయూ జీవీ ఇన్‌చార్జ్ ఉప కులపతి డి.రాజ్యలక్ష్మి , తదితరులు

విజయనగరం టౌన్: భారతరత్న, సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య భారత దేశానికి అందించిన సేవలు ఎనలేనివని జేఎన్‌టీయూ జీవీ ఇన్ చార్జ్ ఉప కులపతి డి.రాజ్యలక్ష్మి అన్నారు. కళాశాలలో ఆదివారం ఇంజినీరింగ్ డే నిర్వహించారు. మోక్షగుండం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు దేశానికి మూల స్తంభాలని, వారి చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉందన్నారు. ప్రతి ఇంజినీరింగ్ విద్యార్థి మోక్షగుండంను ఆదర్శంగా తీసుకుని, ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. గౌరవ అతిథిగా హాజరైన యూనివర్సిటీ ఇంజినీర్ ఎస్.వేణుగోపాలరావు మాట్లాడుతూ.. సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ చాలా ముఖ్యమని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.రాజేశ్వరరావు, సివిల్ ఇంజినీరింగ్ ఇన్‌చార్జ్ విభాగాధిపతి డాక్టర్ జి. అప్పలనాయుడు, డాక్టర్ ఆర్.గురునాథ్, సి.నీలిమాదేవి,కె.శ్రీనివాసప్రసాద్, బిందుమాధురి, హరిప్రకాష్, పాల్గొన్నారు.